
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## ముందుమాట

త్యాగరాజ కీర్తనలు తెల్సిన తెలుగేతరులు చాలా మంది అనే మాట: "మాకు కనక తెలుగు వచ్చుంటే ఎంత సంతోషించి ఉండేవాళ్ళమో, ఎందుకంటే త్యాగరాజ కృతులన్నీ అర్ధం అవుతాయి." ఈ మాట వింతగా ఉంటే త్యాగరాజ పంచరత్న కృతులు ఒకసారి చూడండి పూర్తి అర్ధంతో. అది కూడా కష్టంగా ఉంటే, ఎందరో మహానుభావులు అనే కృతిలో "చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమును బొందువారు" అనేది అర్ధం చేసుకోండి పోనీ. తెలుగు ఎంత అందమైన భాషో చెప్పకనే చెప్తున్నాయికదూ? చిన్నప్పుడు మనం తెలుగు వాచకంలో చదువుకున్న "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై" అనే పద్యంగానీ, "ఇంతింతై వటుడింతయై.." అనే పద్యం గానీ గుర్తు ఉంటే వాటిని వ్రాసిన పోతన ఎంత మహామహుడో చెప్పడం అనవసరం. తెలుగులో పోతన భాగవతం అంటే తెలుగువాళ్ళు చేసుకున్న మహోన్నతమైన అదృష్టం. తెలుగు పద్యాలు కొంచెం కష్టపడితే (అంటే బాగా కృషిచేసి) రాయొచ్చు. కానీ మనం రాసే పద్యాలు ఎంతకాలం నిలుస్తాయి? పోతన పద్యాలు కలకాలం నిలవడానికీ, మనం రాసేవి మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవడానికీ కారణం ఏమై ఉండొచ్చు? నా దృష్టిలో కారణం ఏమిటంటే, భగవత్కృప. పోతన భాగవతం రాయడానికి కారణం "పలికించెడు వాడు రామ భద్రుడట" అని తానే చెప్పుకున్నాడు. మనకీ పోతనకీ అదే తేడా. భగవత్కృప లేకుండా ఇలాంటి పద్యాలు ఎవరేనా రాయ(గల్గ)డం అసంభవం.

భాగవతంలో ఉన్న పద్యాలు చదువుతూంటే ఒక్కొక్కప్పుడు పోతన మీద భగవంతుడు ఎటువంటి కృప చూపించాడో అనిపిస్తుంది. పోతన సహజ పాండిత్యానికి భగవత్కృప తోడైంది – వెరసి మనకి దొరికింది ఒక వజ్రాల గని. పోతన భాగవతంలో పద్యాలు ఎనిమిదో తరగతి విద్యార్ధిక్కూడా సులభంగా అర్ధం అవుతాయి. ఆయనిది ద్రాక్షాపాకం. నోట్లోవేసుకుని చప్పరించడమే. ఆయన ఘంట తేనెలో ముంచి రాసాడా అనిపించక మానదు.

తి.తి.దే వారు పోతన భాగవతాన్ని ఐదు సంపుటాలుగా జంధ్యాల పాపయ్య శాస్త్రి సంపాదకుడుగా తీసుకొచ్చారు. తెలుగువాళ్ళందరు కొని దాచుకోవాల్సిన సెట్ అది. ఈ పుస్తకాలు చదువుతూంటే పోతన

రసగుళికలు రాద్దాం అనిపించింది. అయితే ఇవి రాయడానికి నాకున్న ఒకే ఒక అర్హత ఏమిటంటే తెలుగు రాయడం చదవడం వచ్చు అని చెప్పుకోవడమే తప్ప ఇంకేమీ లేదు. నిజంగా. నేను రాయబోయేది చాలా మటుక్కు కాపీ, పేస్ట్ వ్యవహారమే. నాకు నచ్చిన పద్యాలూ, నాకు తెల్సున్న కథలూ ఇందులో జొప్పించి రాయడం మొదలు పెట్టాను. ఇవన్నీ ఒక వరుసలో భాగవతంలో ఉన్నట్టూ రాయడం లేదు. ఏ ఘట్టం గుర్తు వస్తే అది రాయడమే. ఇందులో పద్యాలకి అన్నిచోట్లా పూర్తిగా అర్థాలు ఇవ్వడం లేదని గమనించగలరు. అవి కావాలిస్తే ఇంటర్నెట్లో దొరుకుతాయి. ప్రతి వ్యాసంలోనూ ఆఖరిపేజీలో ఇచ్చిన లింక్ మీద నొక్కి ఈ వెబ్ సైట్ కి నేరుగా వెళ్ళవచ్చు. ఈ వ్యాస పరంపరలో దొర్లే తప్పులన్నీ నావే అని ఒప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడటం లేదు.

---

# 5 వ భాగం

## గజేంద్ర మోక్షం -2

క్రితం వ్యాసంలో గజేంద్రుడు ఎంత కష్టాపడ్డాడో చూశాం. వెయ్యేళ్ళ పోరాటం తర్వాత ఇంక చావు తప్పదేమో అనే దైన్యం మొదలైంది. "నేను" అనే అహంకారం అంతమవ్వడం మొదలౌతూనే భక్తీ, దానివెంట "నేను కాదు నువ్వే" అనేది ప్రారంభం అవుతాయి.

**శా.** **ఏ రూపంబున దీని గెల్తు? నిటమీఁ దేవేల్పుఁ జింతింతు? నె**
**వ్వారిం జీరుదు? నెవ్వరడ్డ? మిఁక ని వ్వారిప్రచారోత్తమున్**
**వారింపం దగువార లెవ్వ? రఖిల వ్యాపారపారాయణుల్**
**లేరే? మ్రొక్కెద దిక్కుమాలిన మొఱాలింపం బ్రపుణ్యాత్మకుల్** **[8-71]**

ఇప్పుడనుకుంటోంది, “దీన్ని ఏ విధంగా గెలవగలను? ఎవర్ని ప్రార్థిస్తే పని అవుతుంది? దీన్ని అడ్డగించేవాళ్ళూ , వారించేవాళ్ళూ ఎవరూ లేరా? ఉంటే వాళ్ళకి మొక్కుతాను, నా దీనాలాపనలు వినమని." ఏనుగుకి ఇలాంటి ఆలోచన మొదలవ్వగానే మొసలికి దంతాలు నెప్పిపెట్టడం ప్రారంభించాయి.

**ఉ. ఎవ్వనిచే జనించు జగ; మెవ్వని లోపల నుండు లీనమై;**
**యెవ్వని యందు డిందుఁ; బరమేశ్వరుఁ డెవ్వఁడు; మూలకారణం**
**బెవ్వఁ; డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు; సర్వముఁ దానయైనవాఁ**
**డెవ్వఁడు; వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్ [8-73]**

"ఈ జగం అంతా పుట్టడానికీ, ప్రభవించడానికీ లయం అవ్వడానికీ ఒకడెవడో కారకుడుండి తీరాలి. చూడబోతే ఆ ఈశ్వరుడొక్కడే నా బాధ తప్పించగలడు. అందుకే ఆయన్నే వేడుకుంటాను." ఈ పద్యం స్కూళ్లలో పిల్లలకి నేర్పించేది. ఇది వినని తెలుగు వాడు ఉన్నాడంటే నమ్మడం కష్టమే; అంత ప్రాచుర్యం పొందింది. ఇక్కడ్నుంచి గజేంద్రమోక్షం చివరి వరకూ అన్నీ అద్భుతమైన పద్యాలే. భాగవతంలో ఒక్కోచోట పోతన ఏదో లోకంలోకి వెళ్ళిపోయిరాసాడేమో అనిపించే పద్యాలున్నాయి. దీన్నేభగవత్కృప అనుకోవచ్చు.

**క. లోకంబులు లోకేశులు**
**లోకస్థులుఁ దెగినఁ దుది నలోకం బగు పెం**
**జీకటి కవ్వల నెవ్వం**
**డే కాకృతి వెలుఁగు నతని నే సేవింతున్. [8-75]**

"కల్పాంతకాలంలో లోకాలన్నీ పోయినప్పుడు చీకటి ఆవరిస్తే దానిని జీర్ణించుకుని తేజోమూర్తి అయ్యేడుట విష్ణువు. అటువంటి తేజోమూర్తి స్వయంప్రకాశకుడు. ఆయనకి ఎవరి వెలుగూ అక్ఖర్లేదు. అటువంటి వాడినే నేను ఆడుగుతాను రక్షించమని" అంటూ ప్రార్ధనలు చేసాడు గజేంద్రుడు. అయినా విముక్తి లేదు. పోరాటం జరుగుతూనే ఉంది. నిస్సహాయుడై ఇప్పుడు మనసులోకి వచ్చే దౌర్బల్యాన్ని చెప్తున్నాడు.

**క. కలఁ డందురు దీనుల యెడఁ**
**గలఁ డందురు పరమయోగి గణముల పాలం**
**గలఁ డందు రన్నిదిశలను**
**గలఁడు కలం డనెడి వాఁడు గలఁడో లేఁడో? [8-86]**

పరమేశ్వరుడు సర్వాంతర్యామి అంటారు కదా? దీనులకోసం వస్తాడంటారే? అన్ని దిశల్లోనూ ఉన్నాడంటారే? అసలు అలా అనడం నిజమేనా? కలడు కలడు అనే వాడు ఉన్నాడా లేడా? అని సందేహంతో అనుకుటున్నాడు. ఎందుకూ? ఇంకా తనని రక్షించలేదని. అయితే ఒకటి గమనించాలి. రా వచ్చి సహాయం చేయి అని ఇప్పటిదాకా అడగలేదు. ఇప్పుడు అడుగుతున్నాడు.

**శా. లా వొక్కింతయు లేదు; ధైర్యము విలోలంబయ్యెఁ; బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను; మూర్ఛ వచ్చెఁ; దనువున్ డస్సెన్; శ్రమంబయ్యెడిన్;**
**నీవే తప్ప నితఃపరం బెఱుఁగ; మన్నింపందగున్ దీనునిన్;**
**రావే! యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా! [8-90]**

"నా బలం అంతా అయిపోయింది. నించో లేకపోతున్నాను. ప్రాణాలు పోతున్నాయి. అంతకుముందు ధైర్యం ఏదైనా ఉంటే అది పోతోంది. స్పృహ తప్పి పడిపోయేలా ఉన్నాను. నువ్వే తప్ప ఇంక ఎవరూ లేరు. వచ్చి ఈ దీనుణ్ణి రక్షించు" అని అన్నాడు. ఇప్పుడు మన గజరాజు అహంకార మమకారాలన్నీ వదుల్చుకుని, నేను కాదు నువ్వే అనే స్థితికి జేరేడు. అంటే ఇన్నాళ్ళూ చేసిన పోరాటం వల్ల మనః స్థితి మారి సానబెట్టడం అయిపోయింది. వజ్రం ధగ ధగలాడడానికి సమయం ఆసన్నమైంది. ఇటువంటి స్థితికి చేరిన భక్తుడికి భగవద్దర్శనం ఇంకొక్క క్షణం మాత్రం.

**మ. అల వైకుంఠపురంబులో నగరిలో నా మూల సౌధంబు దా**
**పల మందారవనాంతరామృత సరః ప్రాంతేందు కాంతోపలో**
**త్పల పర్యంక రమావినోది యగు నాపన్న ప్రసన్నుండు వి**
**హ్వల నాగేంద్రము "పాహిపాహి" యనఁ గుయ్యాలించి సంరంభియై. [8-95]**

ఇలా గజేద్రం పాహి పాహి అనే సరికి అసలు సిసలైన ఆక్రందన భగవంతుడికి వినిపించింది. అప్పుడు ఆయన అల వైకుంఠపురంబులో, ఆ మూల ఎక్కడో సౌధాల్లో ఉన్నాడు. ఎలా ఉన్నాడు? లక్ష్మీదేవితో వినోదంలో ఉన్నాడు. అయినా సరే ఆయనకి వినిపించింది. వెంఠనే బయల్దేరేడు.

ఈ పద్యానికున్న పేరు భాగవతంలో ఇంకదేనికీ లేదంటే అతిశయోక్తి కాదేమో! పోతన ఈ పద్యం "అల వైకుంఠపురంబులో.. "అని రాసి తర్వాత ఏమి రాయాలో తట్టక సరే తర్వాత చూద్దాం అని బయటకి వెళ్ళాడుట. వెనక్కి వచ్చి చూసే సరికి ఇది పూర్తిగా రాసేసి ఉంది. కూతుర్ని పిల్చి అడిగాడుట "ఇది ఎవరు రాసేరు" అని. "నువ్వే కదా కొంతసేపు క్రితం వచ్చి రాసేసి వెళ్ళావు" అని తిరుగు అడిగిందిట అమ్మాయి. "నేను పొద్దున్ననగా బయటకి వెళ్ళి ఇదే రావడం, నేను రాయలేదే అని ఆశ్చర్యపోయేడుట." అందువల్ల ఇది మహావిష్ణువు పోతనలాగా వచ్చి సొంతంగా రాసిందే అని చెప్తారు.

**మ. సిరికిం జెప్పఁడు; శంఖ చక్ర యుగముం జేదోయి సంధింపఁ; డే**
**పరివారంబునుఁ జీరఁ' డభ్రగపతిం బన్నింపఁ' డాకర్ణికాం**
**తర ధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు; వివాదప్రోత్థిత శ్రీకుచో**
**పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.** [8-96]

సరే, ఇప్పుడు ఆక్రందన విని బయల్దేరాడు విష్ణువు. అహంకార మమకారాల్నీ అన్నింటినీ గెల్చి గజేంద్రుడు - అంటే ఇంద్రద్యుమ్న మహారాజు - సిద్ధంగా ఉన్నాడు. అక్కున చేర్చుకోవడానికి భగవంతుడు రావాలి. రమ్మని పిలవబడ్డాడు కూడా. ఇంకా ఆలశ్యం చేస్తాడా? ఇదిగో వస్తున్నాడు. ఎంత త్వరగా? ఇప్పటిదాకా వినోదంలో ఉన్న లక్ష్మీ దేవితో కూడా చెప్పడు, శంఖం, చక్రం పట్టుకోడు - అంటే ఆయుధాలు పట్టుకెళ్లడం కుడా మర్చిపోయేడు. రాజుగారు వెళ్తూంటే పరివారం అన్నీ సిద్ధం చేయాలి కదా? కానీ పక్కనున్న పరివారాన్ని తీసుకెళ్లడు. "నా మీద ఎక్కండి వెంఠనే వెళ్ళిపోదాం" అనే వాహనం అనే గరుడుడ్ని కూడా మన్నించట్లేదు. ఇదంతా ఎందుకంటే భక్తుడు ఆపదలో ఉన్నాడు కనక. ఇవన్నీ సిద్ధం చేసుకుని వెళ్ళేసరికి ఆలశ్యం అవుతుంది. క్షణం ఆలశ్యం చేయడానికి లేదు; పాపం ఇంత కష్టపడి అహంకార మమకారాలు పోగుట్టుకున్నాడు. అంటే మనం ఎంత త్వరగా శరణాగతి పొందుతామో దానికి లక్ష రెట్లు వేగంతో వస్తాడు భగవంతుడు.

**వ. ఇట్లు భక్తజన పాలన పరాయణుండును; నిఖిల జంతు హృదయారవింద సదన సంస్థితుండును నగు నారాయణుండు కరికులేంద్ర విజ్ఞాపిత నానావిధ దీనాలాపంబు లాకర్ణించి; లక్ష్మీకాంతా వినోదంబులందగులు చాలించి; సంభ్రమించి దిశలు నిరీక్షించి; గజేంద్రరక్షాపరత్వంబు నంగీకరించి; నిజపరికరంబు మరల నవధరించి గగనంబున కుద్గమించి వేంచేయు నప్పుడు. [8-97]**

ఎక్కడ్నుంచి వచ్చిందో అని చూశాడు ఈ ఆక్రందన. వెంటనే అటువేపు బయల్దేరేడు ఎందుకంటే గజేంద్రుడు అడిగిన రక్షా పరత్వం అంగీకరించాడు కాబట్టి. మీరు ఇంట్లో చాలా సీరియస్ గా ఏదో చేస్తున్నారు అందరితో పాటు. మీరు పెంచుకునే కుక్కా, పిల్లీ, మీ పిల్లలూ అందరూ ఉన్నారు ఒకే గదిలో. సడన్ గా మీకు ఏదో వినిపించింది బయట రోడ్డుమీద. ఏదో ఆక్రందన. వెంటనే బట్టలు కూడా మార్చుకోకుండా, చేతిలో ఏం ఉంటే దానితో అలాగే బయటకెళ్ళారు. ఇంట్లో వాళ్లందరూ ఏం చేస్తారు? మీ వెనకనే "ఏమైంది? ఏమైంది?" అంటూ వస్తారు కదా? అదే కిందపద్యంలో చెప్తున్నాడు పోతన.

**మ. తనవెంటన్ సిరి; లచ్చివెంట నవరోధవ్రాతమున్; దాని వె**
**న్కనుఁ బక్షీంద్రుఁడు; వాని పొంతను ధనుఃకౌమోదకీ శంఖ చ**
**క్రనికాయంబును; నారదుండు; ధ్వజినీకాంతుండు రా వచ్చి రో**
**య్యన వైకుంఠపురంబునం గలుగువా రాబాలగోపాలమున్. [8-98]**

తన కూడా లక్ష్మీ దేవి, వెంటనే శంఖ చక్రాలూ, పక్షీంద్రుడూ, నారదుడూ, వైకుంఠంలో ఉండే ఆబాలగోపాలమూ "రొయ్యిమంటూ" వచ్చేరుట. రారు మరీ? వీళ్ళందరికీ విష్ణువు లేకుండా ఉనికి లేదు కదా? ఆయనెక్కడుంటే అక్కడికే పరుగు. ఇంకోలా చెప్పాలంటే, భగవంతుడు మనకి లభించిననాడు మిగతావి అవే వస్తాయి; మనం వాటి గురించి పాకులాడక్కర్లేదు.

**మ. తన వెంచేయు పదంబుఁ బేర్కొనఁ; డనాథస్త్రీ జనాలాపముల్**
**వినెనో? మ్రుచ్చులు మ్రుచ్చలించిరో ఖలుల్ వేదప్రపంచంబులన్?**
**దనుజానీకము దేవతానగరిపై దండెత్తెనో? భక్తులం**
**గని చక్రాయుధుఁ డేఁడి చూపుఁ డని ధిక్కరించిరో? దుర్జనుల్. [8-100]**

అయితే విష్ణువుకి తప్ప మిగతా వాళ్ళకి ఆయన ఎక్కడకి ఎందుకు వెళ్తున్నాడో తెలియదు. అప్పుడు వాళ్ళనుకుంటున్నారుట - ద్రౌపది అడిగినట్టూ ఎవరైనా మళ్ళీ హే ద్వారకావాసా అన్నారేమో? లేకపోతే రాక్షసులెవరో వేదాలు ఎత్తుకొని పోయారేమో? దేవతలమీదకి దండెత్తుకొచ్చారేమో? ఇదీగాకపోతే హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి అడిగినట్టూ ఏడిరా చక్రి చూపించు ఈ స్థంభంలో ఉన్నాడా అని అడిగాడా?

**శా. తాటంకాచలనంబుతో; భుజనటద్ధమ్మిల్లబంధంబుతో;**
**శాటీముక్త కుచంబుతో; నదృఢచంచత్కాంచితో; శీర్ణలా**
**లాటాలేపముతో; మనోహరకరాలగ్నోత్తరీయంబుతోఁ;**
**గోటీందుప్రభతో; నురోజభర సంకోచద్విలగ్నంబుతోన్ [8-102]**

ఇప్పుడు అమ్మవారు విష్ణువు వెంట ఎలా పరిగెట్టారో చెప్తున్నాడు పోతన. ఎలా ఉన్నావిడ అలాగే బట్టలు కూడా సరిచేసుకోకుండా మొహం మీద బొట్టు కూడా ఉందా ఊడిపోయిందా అనేది చూసుకోకుండా బయల్దేరి పరుగెట్టారుట. ఎందుకూ? ఆయన కంగార్లో పరుగెడుతున్నాడు. ప్రపంచం అంతా అమ్మవారి పిల్లలకిందే లెక్క. అందుచేత అయ్యవారు పరుగెడుతుంటే అమ్మవారు ఏమీ అనకుండా పరుగు పెట్టింది.

**క. అడిగెద నని కడువడిఁ జను**
**నడిగినఁ దను మగుడ నుడుగఁ డని నడ యుడుగున్**
**వెడవెడ సిడిముడి తడఁబడ**
**నడు గిడు; నడుగిడదు జడిమ నడు గిడునెడలన్ [8-103]**

ఈ పరుగెట్టడంలో "ఎక్కడికీ?" అని అడుగుదాం అని ముందుకెళ్తోందిట. సరేలే అడిగితే ఈ కంగార్లో చెప్పడేమో అని మళ్ళీ మానేస్తోంది. అలా తడబడుతూ ముందుకో అడుగూ వెనక్కో అడుగూ వేస్తోందిట.

**మ. వినువీథిన్ జనుదేరఁ గాంచి రమరుల్ విష్ణున్ సురారాతి జీ**
**వనసంపత్తి నిరాకరిష్ణుఁ గరుణావర్ధిష్ణుఁ యోగీంద్ర హృ**
**ద్వనవర్తిష్ణు సహిష్ణు భక్తజనబృంద ప్రాభవాలంకరి**
**ష్ణు నవోఢోల్ల సదిందిరా పరిచరిష్ణున్ జిష్ణు రోచిష్ణునిన్ [8-105]**

ఇప్పుడు వినువీధిలో దేవతలందరూ విష్ణువుని చూడ్డానికి వరుసలో నించొనున్నారు. ఎందుకంటే ఆయన ఎంతో కారుణ్యం కలవాడూ, యోగుల హృదయాల్లో ఉండేవాడూ, సర్వత్రా వ్యాంపించి ఉండేవాడూ, కొత్త పెళ్ళికూతుర్లా ఉండే లక్ష్మీ దేవికి సేవచేసేవాడూ కనక.

**మ. "చనుదెంచెన్ ఘనుఁ డల్లవాఁడె; హరి పజ్జం గంటిరే లక్ష్మి? శం**
**ఖ నినాదం బదె; చక్ర మల్లదె; భుజంగధ్వంసియున్ వాఁడె; క్ర**
**న్నన యేతెంచె" నటంచు వేల్పులు "నమోనారాయణాయేతి" ని**
**స్వనులై మ్రొక్కిరి మింట హస్తిదురవస్థావక్రికిం జక్రికిన్ [8-107]**

విష్ణువు గురించి ఆకాశంలోంచి చూసే దేవతలందరూ అనుకుంటున్నారు. అదిగో చక్రం, అదిగో శంఖం, లక్ష్మి కనిపించిందా? ఇదిగో మహావిష్ణువు అని ఆయన కనిపించాక "ఓం నమో నారాయణా" అన్నారు. ఎందుకంటే ఈయన రోజూ కనిపిస్తాడా? ఎంత అదృష్టం ఉండాలి కనిపించడానికి?

**వ. అయ్యవసరంబునఁ గుంజరేంద్రపాలన పారవశ్యంబున దేవతానమస్కారంబు లంగీకరింపక మనస్సమానసంచారుండై పోయిపోయి కొంతదూరంబున శింశుమార చక్రంబునుం బోలె గురుమకరకుళీర మీనమిథునంబై; కిన్నరేంద్రుని భాండాగారంబునుంబోలె స్వచ్ఛమకరకచ్ఛపంబై; భాగ్యవంతుని భాగధేయంబునుంబోలె సరాగజీవనంబై; వైకుంఠపురంబునుంబోలె శంఖచక్ర కమలాలంకృతంబై; సంసార చక్రంబునుంబోలె ద్వంద్వసంకుల పంక సంకీర్ణంబై యొప్పు నప్పంకజాకరంబుఁ బొడగని. [8-108]**

అయితే మన అయ్యవారికి ఇవేం పట్టట్లేదు ఎందుకయ్యా అంటే గజేంద్రుణ్ణి రక్షించాలి మరి. అందువల్ల ఈ నమస్కారాలూ అవీ అంగీకరించకుండా, పోయి పోయి గజేంద్రుడున్న ఈ సరస్సుని చూసాడు. ఇక్కడ పోతన మన సంసార చక్రాన్నీ, హరి వైభవాన్నీ ఎలా ఇరికించాడో చూసారా? - వైకుంఠపురంబునుంబోలె శంఖచక్ర కమలాలంకృతంబై; సంసార చక్రంబునుంబోలె ద్వంద్వసంకుల పంక సంకీర్ణంబై - అందుకే గజేంద్రమోక్షం అంటే సంసారలో ఉండే మన గురించే అనిపిస్తుంది.

**మ. కరుణాసింధుఁడు శౌరి వారిచరమున్ ఖండింపఁగాఁ బంపె స**
**త్వరితాకంపిత భూమిచక్రము మహోద్యద్విస్ఫులింగచ్ఛటా**

**పరిభూతాంబర శుక్రమున్ బహువిధ బ్రహ్మాండభాండచ్ఛటాం**

**తరనిర్వక్రముఁ బాలితాఖిల సుధాంధశ్చక్రముం జక్రమున్. [8-109]**

ఇంక మాట్లాడ్డానికేమీ లేదు. భక్తుడు ఎందుకు పిల్చాడో భగవంతుడికి తెల్సు కదా? వస్తూనే సుదర్శన చక్రాన్ని వదిలేడు. ఆ చక్రం అగ్నికణాలు చిమ్ముతూ ఉండేదీ, ముల్లోకాలలో ఏదీ అడ్డుకోలేనిది; దేవతలందర్నీ రక్షించేదీను.

**శా. భీమంబై తలఁద్రుంచి ప్రాణములఁ బాపెం జక్రమా శుక్రియన్**

**హేమక్ష్మాధర దేహముం జకితవన్యేభేంద్ర సందోహముం**

**గామక్రోధన గేహమున్ గరటి రక్తస్రావ గాహంబు ని**

**స్సీమోత్సాహము వీత దాహము జయశ్రీ మోహమున్ గ్రాహమున్. [8-112]**

ఈ చక్రం పోయి మొసలిని చంపేసింది. మామూలుగా కాదు, భీమంభై తల త్రుంచి మరీ చంపింది. ఈ మొసలి ఎటువంటిదంటే కామ క్రోధాల్తో ఉంటూ, అంతులేని ఉత్సాహంతో అప్పటిదాకా అది మన గజేంద్రుడి రక్తస్రావంలో మునిగితేల్తోందిట. తాగదు మరీ తనకు తానే గజేంద్రుడు సరస్సులోకి వస్తే? అంటే భగవత్ సాక్షాత్కారం అవుతూనే కామ క్రోధ, మద మాత్సర్యాలూ అవీ ఏమన్నా ఇంకా మిగిలి ఉంటే అవన్నీ సమూలంగా నాశనం అయిపోయి పూర్తి అమృతత్వం కలుగుతుంది.

**శా. పూరించెన్ హరి పాంచజన్యముఁ గృపాంభోరాశి సౌజన్యమున్**

**భూరిధ్వాన చలాచలీకృత మహాభూత ప్రచైతన్యమున్**

**సారోదారసిత ప్రభాచకిత పర్జన్యాది రాజన్యమున్**

**దూరీభూత విపన్నదైన్యమును నిర్ధూతద్విషత్సైన్యమున్. [8-116]**

ఈ పాటికి గజేంద్రుడు ప్రాణాలు అలా అలా గాల్లో కల్సిపోయేలా ఉన్నాయి. మొసలి చచ్చిపోయినా అప్పటిదాకా ఉన్న రక్త మాంసాలన్నీ పీల్చేసిందిగా? ఇప్పుడు గజేంద్రుణ్ణి ఉత్సాహపర్చడనికి పూరించెన్ హరి పాంచజన్యము." ఆ శంఖంలో వేదాలున్నాయి. దయాసముద్రం అంత మంచితనం ఉంది. అది బ్రహ్మాండమైన్ శబ్దం చేసేది (భూరిధ్వాన). దీనుల దైన్యాన్ని దూరంచేసేది. 1 తరువాత 5 సున్నాలు ఉండేది లక్ష అయితే 35 సున్నాలు గలది భూరి. ఈ పాంచజన్యం గురించి మళ్ళీ చివర్లో చెప్పుకుందాం.

**మ. మొరసెన్ నిర్జరదుందుభుల్; జలరుహామోదంబులై వాయువుల్**

**దిరిగెం; బువ్వులవానజల్లుఁ గురిసెన్; దేవాంగనాలాస్యముల్**

**పరఁగెన్; దిక్కులయందు జీవజయశబ్దధ్వానముల్ నిండె; సా**

**గర ముప్పొంగెఁ దరంగ చుంబిత నభోగంగాముఖాంభోజమై. [8-117]**

కష్టాలన్నీ తీరిపోయేయి. భక్తుడికి ఆత్మ సాక్షాత్కారం ఐంది. భగవంతుడ్ని చూడ్డం, అయన మాట వినడం (శంఖలోంచి వచ్చిన వేదం) అయింది. అప్పుడు పొంగే సంతోషం ఎలా ఉంటుందో చెప్తున్నాడు ఇక్కడ. దేవతలు దుంధుభులు మోగించారు. హాయిగా గాలి వీచింది. అన్ని జీవాలూ "జయ జయ" శబ్దాలు చేసాయి. తన ప్రియురాలైన గంగా నదికి ఎదురుగా ప్రవహించడం కోసమా అన్నట్టూ సముద్రం ఉప్పొంగింది. ఏ ఒక్క ప్రాణికి ఆత్మ సాక్షాత్కారం ఐనా ఇదే జరుతుంది; ఎందుకంటే ఆ ఒక్క ప్రాణి అనేక లక్షలమందికి ఆశ్రయం అవుతుంది. అందుకే పువ్వుల వానా, వర్షం, సంతోషం ఇత్యాదివన్నీ.

**క. శ్రీహరి కర సంస్పర్శను**
**దేహము దాహంబు మాని ధృతిఁ గరిణీసం**
**దోహంబుఁ దాను గజపతి**
**మోహన ఘీంకార శబ్దములతో నొప్పెన్. [8-119]**

ఇప్పుడు మహా విష్ణువు తన చేతితో గజేంద్రుణ్ణి నిమిరాడు. ఎందుకంటే ఆయన కర స్పర్శ ఇక్కడ ఇంద్రద్యుమ్న మహారాజుకి కావాలి. అసలు ఆయనకి పునర్జన్మ ఉండడకూడదనే ఇలా చేయాల్సివచ్చింది. ఇదంతా ఎందుకంటే, శాపం రాజుగారు విష్ణుధ్యానంలో పడి అగస్త్యుడ్ని పట్టించుకోనందుకు. అది తెలిసి చేసిన తప్పు కాదు. ఇప్పుడు శ్రీహరి కర స్పర్శతో గజేంద్రుడి కష్టాలన్నీ తీరిపోయాయి. హిరణ్యాక్షుడి కథలో చెప్పుకున్నాం ముందొకసారి, శ్రీహరి ఎందుకు వాణ్ణి చేత్తో కొట్టాడో - బహువిధ బ్రహ్మాండభాండచ్ఛటాంతరనిర్వక్రముఁ బాలితాఖిల సుధాంధశ్చక్రముంజక్రము తో చంపకుండా. ఇక్కడ కూడా అదే స్పర్శ. ఇక్కడ పోతన సంస్పర్శ (చక్కటి స్పర్శ) అన్నాడు.

రెండు విషయాలు గమనించారా? ఒకటి, ద్రౌపది "హే ద్వారకావాసా .." అని పిలిచినప్పుడు కూడా భక్త పాల కళాసంరంభనే ముందు. ధుర్యోధనుణ్ణి చంపలేక కాదు. దానవోద్రేక స్థంభన చివరిదాకా వేసి చూసాకే. అందుకే పోతన మొదట రాసిన "శ్రీ కైవల్య పదంబు జేరుటకు నై చింతించెదన్..." అనే పద్యం నభూతో నభవిష్యతి. రెండోది, గజేంద్ర మోక్షం అలవోకగా శార్దూలం, మత్తేభం వృత్తాలతో సాగిపోయింది. కరి (మత్తేభము) భగవత్ సాయుజ్యం పొందడం గురించి రాస్తూ అంత అద్భుతమైన మత్తేభం మీద మత్తేభం వృత్తాలు ఎలా రాసాడు పోతన? అదే "పలికించెడివాడు రామభద్రుం డఁట..." అంటే.

పాంచజన్యం పూరించడం గురించి ఓసారి చెప్పుకుని వ్యాసం ముగిద్దాం. అభిమన్యుడు చచ్చిపోయేక అర్జునుడు తీవ్రమైన మనస్థాపానికి గురై అందర్నీ తిడతాడు అతిరథ మహారధులైన నలుగురు అన్నదమ్ములూ వాళ్ళు వెళ్ళకుండా, కుర్రాణ్ణి పద్మ వ్యూహంలోకి పంపినదుకు. లీలా మానుష విగ్రహుడు మాత్రం ఏమీ తెలియదన్నట్టూ చూస్తూ ఉంటాడు అక్కడే నుంచుని. అప్పుడు అర్జునుడు తీవ్రమైన శపథం చేస్తాడు - రేపు సాయంత్రంలోపుల సైంధవుణ్ణి చంపకపోతే అస్త్ర సన్న్యాసం చేస్తాను అని. ఇప్పుడు కాస్త మనసు

కుదుటబడుతుంది ఎందుకంటే పోయిన దానిగురించి ఆలోచించడం మానేసి చేతిలో ఉన్న పని గురించి ఆలోచించడం మొదలు పెట్టాడు. కర్మ సన్యాసికి కావల్సింది అదే. పోయినదానికి ఏడుస్తూ కూర్చోవడం కాదు. భగవద్గీతలో కర్మయోగం అంతా చెప్పాడు ముందు అర్జునుడుకి. అది మర్చిపోయి అభిమన్యుడి గురించి ఏడుస్తూంటే చిర్రెత్తుకు రాదూ? అయితే కృష్ణుడు బాగా సానుకూల దృక్పథం ఉన్నవాడు. ఎప్పుడైతే మళ్ళీ శిష్యుడు దార్లో పడుతున్నాడో అప్పుడు ఉత్సాహ పరచడానికి పాంచజన్యం తీసి ఊదుతాడు అర్ధరాత్రి, అర్జునుడు శపథం చేసిన వెంటనే. ఆ రోజుల్లో ఏ శంఖం ఎవరు ఊదారో చెప్పగలిగే వారుట, శబ్దం బట్టి. వెంఠనే సైంధవుడికి అర్ధమైపోయింది తన జాతకం ఇంక ఇరవైనాలుగ్గంటల్లో అంతం కాబోతోందని. ఈ పాంచజన్యం కథ మళ్ళీ ధృవోపాఖ్యానంలో చూద్దాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS